క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ

రాయచోటి టౌన్ : పట్టణ పరిధిలో సంచరిస్తున్న అనాథ వృద్ధులకు రాయచోటి విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. మంగళవారం రాత్రి రాయచోటిలో వృద్ధులకు రాయచోటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి చేతులమీదుగా వీటిని అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చాంద్‌బాషా, ఆర్.విజయ్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ ఆర్.పాపయ్య, జూనియర్ అకౌంట్ ఆఫీసర్ ఎం.మహేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం

సిద్దవటం : ప్రజలకు ప్రభుత్వ సేవలందించడంలో వలంటీర్లు విశేషంగా కృషి చేస్తున్నారని ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లను సేవల ఆధారంగా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు, నగదు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు మురాషావలి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాత

సంబేపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్ వ్యాధిపై కళాజాతను నిర్వహించారు. ఎయిడ్స్ నివారణ, నియంత్రణ మండలి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నటరాజ్ బృందం తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ జానపద కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పాటల రూపంలో ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వీరబల్లెలో..

వీరబల్లె (రాయచోటి టౌన్) : మండల కేంద్రంలో ప్రజలకు ఎయిడ్స్‌పై కళాజాత బృందం వారిచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో కేంద్ర కళాజాత బృందం వారితో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ విజయవాడ వారి ఆదేశాల మేరకు బుర్రకథ, పాటలతో అవగాహన కల్పిస్తూ ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ జయ, హెల్త్ అసిస్టెంట్ నాగయ్య, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం నేడు

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నేడు నిర్వహించనున్నట్లు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అతిథిగా పాల్గొనే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

నివాళి

ఓబులవారిపల్లె : గాదెల వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొమ్మూరు చెంచురెడ్డి(90) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బుధవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, పార్టీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డిలు మృతుడి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

నీటి సమస్య రానివద్దు

చిన్నమండెం : మండల వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను పరిష్కరించేందుకు సత్వరం కృషి చేయాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రామకృష్ణతో సమావేశమయ్యారు. వచ్చేది వేసవి కాలం కావడంతో ప్రజలు నీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు దేవనాథరెడ్డి సూచించారు.

సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి



సూర్యనారాయణను సత్కరిస్తున్న నాయకులు

నందలూరు(రాజంపేట): మండలంలోని సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తానని నందలూరు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. బుధవారం నారాయణరాజుపేటలోని సుధాకర్‌రెడ్డి గార్డెన్స్‌లో మండల సర్పంచుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచులు ఐక్యంగా, సంఘటితంగా ఉండి, పాలనా పరంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు.

అభినందనలు

రాజంపేట రూరల్ : శ్రీశైల దేవస్థానం పాలక మండలి సభ్యులు బొల్లినేని రామ్మోహన్‌నాయుడికి వైఎస్సార్‌సీపీ నాయకుల అభినందనల వెల్లువ కొనసాగుతోంది. మిట్టమీదపల్లి గ్రామంలోని ఆయన స్వగృహానికి డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపీ, గవర్నమెంట్ హస్పిటల్ డైరెక్టర్ ఎస్.జాకీర్‌హుస్సేన్‌లు ఉన్నారు.

వేడుకగా ఫేర్‌వేల్ డే

పెనగలూరు (ఓబులవారిపల్లె) : కస్తూర్బా గాంధీ పాఠశాలలో బుధవారం ఏఎస్‌ఓ సుచరిత ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ వీడ్కోలు సమావేశానికి ఎంఈఓ గిరి వరదయ్య, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు. ఈ ఇష్టపడి చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సూచించారు. విద్యార్థినులు మంచి ర్యాంకులతో ఉత్తీర్ణులై పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్టీయూ నాయకులు సూచించారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ విప్లవం

- పథకాలు ప్రతి గడపకు చేర్చడంలో వలంటీర్ల కృషి అమోఘం
- హామీలను 99శాతం నెరవేర్చాం
- లక్కిరెడ్డిపల్లెలో వలంటీర్లకు వందనంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. బుధవారం జరిగిన లక్కిరెడ్డిపల్లె మండలంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు పురస్కార ప్రదానం కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల చెంతకే పాలనను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. 2 వేల జనాభా దాటిన ప్రతి గ్రామానికి సచివాలయాన్ని తీసుకువచ్చి పరిపాలనను సరళీకరించిన ఘనత తమ ప్రభుత్వానిదే అని తెలిపారు. ప్రతి గ్రామంలో సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల నూతన భవనాలు, నాడు - నేడుతో ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల అభివృద్ధి పనులు కళ్లకు కట్టినట్లుగా కనబడుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతం నెరవేర్చిన నాయకుడు ఒక్క వైఎస్ జగనే అని అన్నారు. రూ. 2.55 లక్షల కోట్ల నిధులను వివిధ సంక్షేమ పథకాలు ద్వారా ప్రజలకు అందించడం జరిగిందని, చెప్పింది చెప్పినట్లుగా సీఎం జగన్ చేస్తున్నారన్నారు.

ప్రజలకోసం 124 సార్లు బటన్ నొక్కారు.. జగన్ కోసం రెండు సార్లు బటన్ నొక్కాలి

57 నెలల్లో ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించేందుకు సీఎం జగన్ 124 సార్లు బటన్ నొక్కారని, ఈ మంచి ఇలాగే జరగాలంటే జగన్ కోసం రెండు సార్లు బటన్ నొక్కాలని, ఒకటి శాసనసభ స్థానం కోసం, రెండోది పార్లమెంట్ ఎన్నికల కోసమని పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీల పేరుతో మరో నాటకం..

అధికారంలోకి రావడానికి చంద్రబాబు అమలుకాని హామీలను ఇస్తారని, అధికారంలోకి వచ్చాక నేను మీకు చెప్పానా అని మోసం చేస్తారని ఎద్దేవా చేశారు. బాబు తీసుకొచ్చిన ఆరు గ్యారెంటీల అమలు అసాధ్యమని, ఎలా అమలు చేస్తారో తెలపండి అంటూ ప్రశ్నిస్తే సమాధానం లేదని పేర్కొన్నారు. సంక్షేమం అందిస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందన్న చంద్రబాబు నేడు అదే సంక్షేమ పథకాలను మేనిఫెస్టోలో పెట్టించిన విజయం వైఎస్సార్‌సీపీదేనన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు అసాధ్యమని గుంటనక్క చంద్రబాబు బూటకపు మాటలు ప్రజలు విశ్వసించరాదని సూచించారు. చంద్రబాబుకు నిజంగా ప్రజల్లో విశ్వాసం ఉంటే ఎవరి పొత్తు లేకుండా ఎన్నికలలో పోటీ చేసే దమ్ము ఉందా అంటూ సవాల్ విసిరారు. పవన్ కళ్యాణ్, బీజేపీ, కాంగ్రెస్ తదితర పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నారన్నారు. ప్రజల ఆశీస్సులతో జగన్ సింహంలా ఒంటరిగా పోటీ చేస్తున్నారన్నారు. ఊపిరి ఉన్నంతవరకు ప్రజా సేవకే తన జీవితం అంకితమని, నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం అనునిత్యం కృషి చేస్తున్నామన్నారు.

సేవా సైన్యానికి వందనాలు

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా నిలబడి సేవాభావంతో లంచాలు లేకుండా, వివక్షతకు తావులేకుండా సేవలందిస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లను ప్రోత్సహిస్తూ వరుసగా నాల్గవ ఏడాది వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధన దిశగా సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను నెలకొల్పి ప్రజలకు సేవ చేసే సదవకాశాన్ని ఎంతోమంది యువతకు కల్పించారన్నారు. అనంతరం వలంటీర్లను నాయకులతో కలసి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమాదేవి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, సుబ్బరాయుడు, రవిరాజు, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, రమణయ్య, వెంకటరమణ, జనార్దన్‌రెడ్డి, గడ్డం ప్రభాకర్ రెడ్డి, మీరావలి, ఎంపీటీసీలు దస్తగిరి, జగన్‌మోహన్ రెడ్డి, లక్ష్మినారాయణ, శంకర్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మద్దిరేవుల గ్రామం మార్లవాండ్లపల్లెకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ వి.ఆంజనేయులు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్నారు. బుధవారం ఆంజనేయులను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, సయ్యద్ అమీర్, సిద్దక నాగిరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉయ్యాలవాడ వర్ధంతి సభ

రాయచోటి : మొదటి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని రాయచోటి లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ మాజీ సభ్యులు ఎర్రపురెడ్డి విశ్వనాథ రెడ్డి కోరారు. బుధవారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ జిల్లా, రేనాటి సూర్యచంద్రుల విగ్రహ సాధన కమిటీ కన్వీనర్ టి.ఫణి ఆధ్వర్యంలో నేడు గురువారం కడప వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు.

సత్కారం

రాజంపేట : ఇన్‌ఫ్యాంట్ జీసెస్ స్కూల్‌లో జాతీయ స్థాయి బాలికల కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిన స్టేట్ స్కూల్ గేమ్స్ కార్యదర్శి భానుమూర్తిరాజును ఘనంగా సత్కరించారు. బుధవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి పీఈటీలు పీడీలకు ప్రత్యేకశిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణకు హాజరైన భానుమూర్తిని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు మలిశెట్టి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఆర్థికసాయం

చిట్వేలి : ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో గాయాలైన రాయన మహాలక్ష్మికి వడ్డెర సేవా సంఘం సభ్యులు బుధవారం రూ.30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కాగా కెకె వడ్డిపల్లికి చెందిన ఆర్.మహాలక్ష్మి అనే గర్భిణి మూడు రోజుల క్రితం చలిమంట వద్ద చలి కాచుకుంటుండగా ప్రమాదవశాత్తు వెనుకవైపు గాయాలయ్యాయి.

నీటి సమస్యను పరిష్కరించండి

- అధికారులకు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి సూచన



సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

సిద్దవటం : మాధవరం-1 గ్రామ పంచాయతీలోని నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని వైఎస్ఆర్‌సీపీ రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని మాధవరం-1లో బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ సిద్దవటం మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన మాధవరం-1లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు నా దృష్టికి తీసుకొచ్చారన్నారు. చైర్మన్ వెంటనే స్పందించి జెడ్పీ నిధుల నుంచి 4 కొత్త మోటార్లను మంజూరు చేశారు. వెంటనే మోటర్‌లను బిగించి తక్షణమే తాగునీటి సమస్యల లేకుండా పరిష్కరించాలని ఆయన అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వీరన్న, జిల్లా పరిషత్ అధికారులు రమణారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, సురేష్, సిద్దవటం ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, నాయకులు పల్లి సుబ్బరామిరెడ్డి, వలి చాన్, ఎంపీటీసీ శివయ్య, లక్ష్మిరెడ్డి, సర్పంచ్ జానకిరామయ్య, మాజీ సర్పంచ్ ఎం.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం!

మండల సర్వసభ్య సమావేశంలో నిలదీసిన ఎంపీటీసీలు

సిద్దవటం : మండలంలోని పలు ప్రభుత్వ సమస్యలపై ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సభా భవనంలో బుధవారం ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలో అసైన్‌మెంటు కమిటీ కొన్ని సంవత్సరాలుగా జరగలేదని బొగ్గిడివారిపల్లి ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరం-1 ఎంపీటీసీ సభ్యులు శివయ్యలు సభా దృష్టికి తీసుకొచ్చారు. మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల నిబంధనలు పెట్టడంతో అర్హులైన వారు ప్రభుత్వ భూములకు నోచుకోలేదన్నారు. ఈ నిబంధనలను ఎత్తి వేయాలని వారు డిమాండ్ చేశారు. పెన్నానది నుంచి నేకనాపురం, కొమ్మనాయినిపల్లి గ్రామాల ప్రజలు తాగునీరు రాకపోవడంతో వారు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పెద్దపల్లి పంచాయతీలోని మలినేని పట్నం కాలనీలో తాగునీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, స్థానికంగా ఉన్న బోరులో నుంచి సక్రమంగా నీరు రావడంలేదని, వేరొక బోరు ఏర్పాటు చేయాలని పెద్దపల్లి ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి సభకు విజ్ఞప్తి చేశారు. అంతేగాకుండా గ్రామాల్లో పలు ప్రదేశాల్లో ఉన్న వీధి లైట్ల సమస్య, మురుగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. దీంతో అధికారుల తీరుపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. మాధవరం-1 పంచాయతీలో రేషన్ పంపిణీలో జరుగుతున్న అక్రమాలపై ఎంపీటీసీ సభ్యుడు శివయ్య సభలో ప్రస్తావించారు. అక్రమాలకు పాల్పడుతున్న సదురు డీలర్, ఎండీఎం ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు మురాషావలి, ఎంపీడీఓ ఉమామహేశ్వర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, టక్కోలి ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బమ్మ, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, గ్రామ సర్పంచ్‌లు పలు శాఖల అధికారులు, ఎంపీపీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



గాలివీడు: మాట్లాడుతున్న సీఐ జీవన్ గంగాధర్

గాలివీడు : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగాధర్ బాబు హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఎగువ గొట్టివీడులో ఎస్ఐ వెంకటప్రసాద్‌తో కలిసి శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాట్లాడుతూ త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. అలా కాదని విద్వేషాలతో , ముఠా కక్షలను ప్రేరేపించి అల్లర్లకు పాల్పడిన వారిపై బైండోవర్లు, రౌడీషీటర్లు తెరచి కటకటాల వెనక్కి పంపుతామని హెచ్చరించారు. పేకాట, బెట్టింగ్, మట్కా, సారా, కోడి పందాలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆయనతోపాటు వెంట ఎస్ఐ, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త

చిన్నమండెం : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ విషయంపై బుధవారం మండల పరిధిలోని చాకిబండ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయని ఎవరూ గుడ్డిగా వినరాదన్నారు. ముఖ్యంగా యువత సెల్‌ఫోన్ మోజులో పడి ఆన్‌లైన్ మోసాల బారిన పడకూడదని సూచించారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పథకాల మంజూరులో పైరవీల్లేవు

- వలంటీర్ల సేవలు ఎనలేనివి
- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు అర్బన్: వలంటీర్లను సత్కరించిన ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



పుల్లంపేట: వలంటీర్లను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల, కొల్లం గంగిరెడ్డిలు

రైల్వేకోడూరు అర్బన్ : ప్రజలకు ప్రభుత్వ సేవలు దగ్గర చేయాలనే సంకల్పంతో సీఎం జగన్ వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చినట్టు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సభా భవనంలో వలంటీర్లకు పురస్కారాలు అందించి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. పథకాలు అందివ్వడంలో వలంటీర్లు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ముఖ్యంగా కరోనా కష్టకాలంలో వారు అందించిన సేవలు రాష్ట్ర ప్రజలు మరువలేరన్నారు. నేడు ఎటువంటి లంచాలు, పైరవీలు లేకుండా సేవలందించడం అభినందనీయమన్నారు. సీఎం వైఎస్ జగన్ వలంటీర్లపై పెట్టుకున్న నమ్మకాన్ని ఏమాత్రం తక్కువ చేయరాదని తెలియజేశారు. వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉంటూ ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. స్ఫూర్తిని నింపడంలో భాగంగానే ప్రభుత్వం వారికి పురస్కారాలు అందిస్తోందన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకే ఓట్లు అడిగే హక్కు ఉందని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అన్ని గ్రామాలలో అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని ప్రభుత్వవిప్ కొనియాడారు. టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాలు ప్రజలు తిప్పికొట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఎంపీపీ భవానీ, ఉప సర్పంచ్ తోట శివసాయి, జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, బి.శివయ్య, అబ్దుల్ రౌఫ్, గుంటిమడుగు సుధాకర్ రాజు, మల్లికార్జున, మహేష్, మహమ్మద్, హరికృష్ణారెడ్డి, తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, షఫీ, రత్నారాణి, వలంటీర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆదర్శంగా జగనన్న పాలన

పుల్లంపేట: జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, అందరి చూపు ఆంధ్రా వైపు అని, దేశంలో వలంటీర్ వ్యవస్థ తెచ్చిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2 వేలు జనాభా కల్గిన ప్రతి గ్రామ పంచాయతీకి సచివాలయాన్ని ఏర్పాటు చేసి గాంధీజీ కన్న కలలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారం చేశారన్నారు. గ్రామాల అభివృద్ధి నడుం బిగించిన సీఎం వైఎస్ జగన్ ఒక్కరే అని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను గ్రామాల్లోనే నెలకొల్పి వారికి ప్రభుత్వ సేవలను గడప వద్దకే అందుబాటులోకి తెచ్చారన్నారు. 57 నెలలో జగనన్న ప్రజల కోసం 124 సార్లు బటన్ నొక్కారని, 2024 ఎన్నికలలో ప్రజలకు న్యాయం జరిగి ఉంటే జగనన్నను మరలా మరొక్కసారి ఆశీర్వదించాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ జగనన్నకు ఓటు వేయాలని కోరారు. తదుపరి రైతు భరోసా కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయశంకర్, జెడ్పీటీసీ గీతా రామనాథం, నాయకులు కుమార్ రెడ్డి, వై.మల్లికార్జున రెడ్డి, ఆలం చెంగయ్య, ఎ.శంకర్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులు, బికె మణి, గుంటిమడుగు సుధాకర్ రాజు, హేమనవర్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే జగనన్న ధ్యేయం



తారురోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

సంబేపల్లె : గ్రామాల అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. దశాబ్దాల కాలంగా ఆయా గ్రామాలలోని రోడ్ల అభివృద్ధికి నోచుకోక ప్రజలు చాలా ఇబ్బందులు గురయ్యేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మండల వ్యాప్తంగా ఉన్న గ్రామీణ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో బుధవారం మండల పరిధిలోని దేవపట్ల మిట్ట సమీపంలోని చిత్తూరు - కర్నూలు జాతీయ రహదారి నుంచి రెడ్డివారిపల్లెకు ఉన్న 2.2 కిలోమీటర్ల మట్టిరోడ్డును దాదాపు రూ.70 లక్షలతో తారు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. పీఆర్‌జేఈ మహబూబ్ బాషా, గుత్తేదారు వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో విగ్రహ ప్రతిష్ట

రాయచోటి టౌన్ : లక్ష్మీపురంలో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు తన సొంత నిధులతో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా ఆలయంలో స్వామి వారి ప్రతిష్ఠతను వేదపండితుల మంత్రోచ్చారణలతో విగ్రహ ప్రతిష్ట జరిపారు.


నెలవారీ నివేదికలు తప్పక అందజేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డెమో దేవశిరోమణి

రాయచోటి అర్బన్ : ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, స్కానింగ్ కేంద్రాల వైద్యులు, ల్యాబ్, డయాగ్నస్టిక్ కేంద్రాల సిబ్బంది ప్రభుత్వానికి రోజువారీ, నెలవారీ నివేదికలు తప్పకుండా అందజేయాలని అన్నమయ్య జిల్లా డిప్యూటీ డెమో దేవశిరోమణి అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో రాయచోటి డివిజన్ పరిధిలోని ప్రైవేట్ వైద్యులు, వైద్య సిబ్బందిలు ప్రభుత్వానికి ఇవ్వవలసిన నివేదికలపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏపీఏపీఎం సీఈ - 2002 చట్టం ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాల యాజమాన్యలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు ఉండాలన్నారు. రోగులకు అందించిన చికిత్సలకు తగిన బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. డీఎస్ఓ కరీముల్లా మాట్లాడుతూ ఆసుపత్రులలో రోజువారీ ఓపీ, ఐపీలతోపాటు తదితర వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా అంటువ్యాధుల నివారణ పర్యవేక్షకులు వెంకటేష్ మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల వివరాలు రోజువారీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలంటూ కోరారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ నెలనెలా ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌ల రిపోర్టుల పర్యవేక్షణకు గాను డివిజన్ స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నామంటూ చెప్పారు. చెక్ లిస్ట్ ప్రకారం తనిఖీ చేసి జిల్లా ఉన్నతాధికారులకు రిపోర్టు అందజేస్తామన్నారు. నెనె

గురువును మించిన దైవం లేదు



అధ్యాపకులను సన్మానిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

వీరబల్లె (రాయచోటి టౌన్) : గురువును మించిన దైవం లేదని వీరబల్లె ప్రభుత్వ జూనియర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రఘురామయ్య అన్నారు. బుధవారం కళాశాల అధ్యాపకులుగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేసిన శ్రీనివాసుల శెట్టి, రామనారాయణలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీరబల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు వీరనాగిరెడ్డి సతీసమతేంగా పాల్గొనగా, కలకడ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణయ్య, అధ్యాపకులు నరసింహారెడ్డి, వేంపల్లె వాసవీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సురేంద్ర, అధ్యాకులు రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషపై మక్కువ పెంచుకోవాలి

రాయచోటి టౌన్ : మాతృభాషలో పట్టు సాధిస్తే పరభాష నేర్చుకోవడం చాలా సులువు అవుతుందని మాసాపేట జిల్లా పరిషత్ తెలుగు భాషా ఉపాధ్యాయుడు మోటపోతు ఉత్తన్న అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాష ప్రత్యేకతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు తన సొంత నగదుతో బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మాతృభాషపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. పూర్వకాలం నుంచి తెలుగు భాషకు ఒక ప్రత్యేకత ఉందని శ్రీకృష్ణదేవరాయుల అంతటి గొప్ప రాజు దేశభాషలందు తెలుగు లెస్స అన్నాడంటే తెలుగు భాషకు ఉన్నటువంటి గొప్పతనం ఏ పాటిదో అర్థం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివకుమార్ రెడ్డి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మండలంలోని శ్రీ రిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. భారతమాత వేషధారణతో అంతర్జాతీయ భాషా దినోత్సవం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్ టీచర్ దామోదర వల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాషను కాపాడుకుందాం

రాజంపేట రూరల్ : మాతృభాషను నిర్లక్ష్యం చేస్తే భాష మనుగడకు, తెలుగు జాతి ఉనికికి పెను ప్రమాదమని తెలుగుభాష సంరక్షణ సమితి మండలశాఖ అధ్యక్షులు బొట్టా రామచంద్రయ్య నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక రీజెన్సీ నలంద పాఠశాలలో బుధవారం మాతృభాష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ వేడుకలలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు బీవీ నారాయణరాజు, మానవత స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు షేక్ అబ్దుల్లాలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరం తెలుగు భాషను కాపాడుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్‌రావు, అధ్యాపకులు వెంకటనాయుడు, విజయమ్మ, నాగార్జున, శ్రీవిద్య, పాఠశాల సీఈఓ విజయచందు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మధురమైంది మాతృభాష

నందలూరు(రాజంపేట): మధురమైన భాష మన తెలుగు భాష అని, అటువంటి మాతృభాషను కాపాడుకోవాల్సినటువంటి అవసరం తెలుగువారిపై ఉందని నాగిరెడ్డిపల్లె జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి పేర్కొన్నారు. బుధవారం మాతృభాష దినోత్సవం సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు జి.వెంకటరమణ, గీతా, రమణమ్మల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

తెలుగు ఉపాధ్యాయులకు సన్మానం

పెనగలూరు (ఓబులవారిపల్లె): మాతృభాష దినోత్సవం సందర్భంగా బుధవారం పెనగలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయులను ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు పి.రామకృష్ణ మాట్లాడుతూ మాతృభాషకు తెలుగువారు తగిన ప్రాధాన్యత ఇచ్చి ఎక్కడికి వెళ్లినా మాతృభాషలో మాట్లాడేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా తెలుగు ఉపాధ్యాయులను సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందని ఎస్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు పిల్లి రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.